క్లుప్తంగా

ఉన్నత లక్ష్యం ఏర్పర్చుకోవాలి

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు ఉన్నత లక్ష్యం ఏర్పర్చుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పూర్వపు వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ హనుమంతు లజిపతిరాయ్ అన్నారు. చిలకపాలెం శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఇంజినీరింగ్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించారు. విద్యార్థులు తాము చదువుతున్న బ్రాంచ్‌పై పట్టు సాధించాలన్నారు. విషయ పరిజ్ఞానం, సబ్జెక్టుపై పట్టు, కమ్యూనికేషన్ స్కిల్ వంటి అంశాలు కీలకంగా చెప్పారు. నూతన విద్యా విధానం నేపథ్యంలో విద్యలో అనేక మార్పులు వస్తున్నాయన్నారు. విద్యార్థులు ఇన్‌టర్న్‌షిప్‌కు ప్రాధాన్యత నివ్వాలని, పారిశ్రామిక అవసరాలు తెల్సుకోవాలని చెప్పారు. అనుకూల దృక్పథంతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ జి.టి.చంద్రశేఖర్, ప్రొఫెసర్ కె.మధు పాల్గొన్నారు.

ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి



బైపాస్ కూడలి వద్ద పోలీస్ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ రాధిక

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. కుశాలపురం బైపాస్ కూడలిని మంగళవారం పరిశీలించి, ప్రమాద నియంత్రణకు సంబంధించి పోలీస్ సిబ్బందికి సూచనలు చేశారు. స్పీడ్ బ్రేకర్లు ఉన్నచోట వాహనదారులకు ఇబ్బంది లేకుండా రంగులు వేయాలని, ఇండికేటర్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. డ్రమ్‌లు ఏర్పాటు చేసేటప్పుడు వాటిపై స్టాప్ అక్షరాలు చీకటిలో కూడా కపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జేఆర్‌పురం సీఐ ఆదాం, ఎస్‌ఐ సత్యనారాయణ ఉన్నారు.

కారు పార్కింగ్‌పై ఫిర్యాదు



వివాదాస్పద స్థలంలో ఉన్న టీడీపీ నేత కారు

రణస్థలం: వివాదాస్పద స్థలంలో టీడీపీ నేత డీజీఎం ఆనందరావు కారు పార్కింగ్ చేయడంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులురాలు పిన్నింటి నాగభూషణమ్మ మంగళవారం తెలిపారు. మండల కేంద్రంలోని సర్వే నంబర్ 2–1లో ఉన్న 13 సెంట్ల స్థలం తమ అధీనంలో ఉందని, దీనిపై ప్రభుత్వానికి తమకు న్యాయస్థానంలో కేసు నడుస్తోందన్నారు. వివాదాస్పద స్థలంలోకి వెళితే దుర్భషలాడుతూ, కావాలనే రెచ్చగొట్టే చర్యలు చేస్తున్నారన్నారు. వివాదాస్పద స్థలం నుంచి కారును తొలగించాలని పోలీసులను కోరారు.

సీఐగా కామేశ్వరరావు బాధ్యతల స్వీకరణ



ఎస్పీ రాధికకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కామేశ్వరరావు

గార: గార స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ సీఐగా పదోన్నతి పొందిన ఎస్.కామేశ్వరరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రెండు నెలలు పాటు ఎస్సైగా పనిచేసిన ఆయన కొద్ది రోజుల క్రితం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి సాధించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లా ఎస్పీ జీఆర్ రాధికను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

బస్ సౌకర్యం కలించాలని వినతి

జి.సిగడాం: విద్యార్థులకు ప్రత్యేకంగా బస్ సౌకర్యం కలించాలని శ్రీకాకుళం ఆర్టీసీ అధికారులకు పాలఖండ్యాం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ధారబోయిన ధర్మరాజ్ మంగళవారం వినతిపత్రం అందించారు. పాలఖండ్యాం కూడలి వద్ద టంకాల దిగ్గవలస, నిద్దాం, పాలఖండ్యాం, జగన్నాథపురం, మండాకురిటి, మెట్టవలస, నక్కపేట గ్రామాలకు చెందిన విద్యార్థులు పాలఖండ్యాం నుంచి సుదూర ప్రాంతాల్లోని విద్యాలయాలకు వెళ్తుతున్నారని సర్పంచ్‌లు ధరబోయిన రెయ్యమ్మ, టంకాల జగన్‌మోహిని, కామొజుల అరుద్ర అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఉదయం సమయంలో పొందూరు నుంచి రాజాం, రాజాం నుంచి శ్రీకాకుళం వెళ్లడానికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని విన్నవించారు.

ఇసుక ర్యాంపు కోసం పరిశీలన

గార: శాలిహుండం వద్ద ఇసుక ర్యాంపు నిర్వహణ కోసం మైన్స్, భూగర్భ నీటి వనరుల శాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. అంబళ్లవలస ర్యాంపునకు వంశధార నదిలో నీరు పెరగడంతో ప్రత్యామ్నాయంగా శాలిహుండం వద్ద నదిని పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. రోడ్డు కనెక్టవిటీ, ఇసుక లభ్యత వంటి పలు అంశాలపై నివేదకలు అందజేస్తామని అధికారులు తెలిపారు.

వ్యవహారిక భాషకు ఆద్యుడు ‘గిడుగు’



శ్రీకాకుళం అర్బన్: గాంధీ మందిరంలో గిడుగు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

- వాడవాడలా రామ్మూర్తి పంతులు జయంతి వేడుకలు

శ్రీకాకుళం అర్బన్: వ్యవహారిక భాషకు ఆద్యుడు గిడుగు రామ్మూర్తి పంతులని వక్తలు అన్నారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో గిడుగు జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగుభాషాభివృద్ధికి రామ్మూర్తి పంతులు చేసిన కృషిని కొనియాడారు.

శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో గిడుగు జయంతి వేడుకలు జరిగాయి. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. బీఆర్ఏయూ తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఉదయ్ కిరణ్, కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ పైడి వెంకటరమణ, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ తెలుగు భాష గొప్పదనం, తెలుగుజాతి గౌరవం, తెలుగు ప్రాశస్త్యాన్ని వివరించారు. గిడుగువారి కుటుంబీకులైన సరస్వతి, సూర్యనారాయణ సమకూర్చిన పది వేల రూపాయలను డిగ్రీ ఫైనలియర్‌లో అత్యధిక మార్కులు సాధించిన రమాదేవికి రూ.5,555, ద్వితీయ సంవత్సరం విద్యార్థిని బుంగ సుకన్యకు రూ. 3333, ప్రథమ సంవత్సరం విద్యార్థిని టి. భాగ్యశ్రీకి రూ. 1111 ప్రిన్సిపాల్ సురేఖ అందజేశారు. కార్యక్రమంలో గరిమెళ్ల సాహితీ స్రవంతి అధ్యక్షుడు వి.జి.కె.మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఐక్యుఏసీ కోఆర్డినేటర్ రోణంకి హరిత, తెలుగు అధ్యాపకులు పి.నారాయణరావు పాల్గొన్నారు.

ప్రజారవాణా కార్యాలయంలో..

శ్రీకాకుళం అర్బన్: గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకువచ్చిన ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి అని ఆర్టీసీ డీపీటీవో ఎ.విజయ్‌కుమార్ అన్నారు. గిడుగు జయంతిని శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో నిర్వహించారు. ఆకాశపు విజయకుమార్ జ్యోతి ప్రజ్వలన చేశారు. తెలుగు భాషకు గిడుగు చేసిన సేవలను కొనియాడారు. శ్రీకాకుళం 1–2 డిపో మేనేజర్లు కె.మాధవ్, కె.ఆర్.ఎస్.శర్మ, అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు పాల్గొన్నారు.

శ్రీచైతన్య పాఠశాలలో..

శ్రీకాకుళం అర్బన్: శ్రీచైతన్య పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆర్.రాంప్రసాద్ ఆధ్వర్యంలో తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. దేశ నాయకుల వేషాలతో విద్యార్థులు అలరించారు. పాఠశాల అకడమిక్ డీన్ సి.హెచ్.శ్రీనివాసరావు, ఐపీఎల్ ఇన్‌చార్జి బి.జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ మందిరంలో..

శ్రీకాకుళం అర్బన్: ప్రతి ఒక్కరు తెలుగు మాట్లాడడంతో పాటు పిల్లలకు తెలుగుభాష గొప్పతనాన్ని తెలియజేసి వారు తెలుగు భాషలో సంభాషించేలా చేయడమే వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులకు ఇచ్చే గౌరవమని పలువురు వక్తలు పేర్కొన్నారు. నగరంలోని గాంధీ మందిరం స్వాతంత్య్ర సమరయోధుల స్మృతివనంలో గిడుగు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అవధాన పండితులు పైడి హరనాథరావు, ప్రముఖ వ్యాఖ్యాత వావిలపల్లి జగన్నాథంనాయుడు, డాక్టర్ జామి భీమశంకరరావు, జిల్లా టూరిజం అధికారి నారాయణరావు, గాంధీ మందిరం నిర్వాహకులు డాక్టర్ నిక్కు అప్పన్న, నటుకుల మోహన్, బరాటం లక్ష్మణరావు, కొంక్యాన వేణుగోపాల్, పందిరి అప్పారావు, డాక్టర్ బాడాన దేవభూషణరావు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో..

శ్రీకాకుళం అర్బన్: తెలుగు సాహిత్యాన్ని సరళీకరించిన మహోన్నత వ్యక్తి గిడుగు రామ్మూర్తి పంతులు అని మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎన్. సుబ్రహ్మణ్యం అన్నారు. బలగ గ్రంథాలయ శాఖలో ఆ శాఖ ప్రతినిధి పి.ఉగ్రసేన ఆధ్వర్యంలో గిడుగు జయంతి వేడుకలను నిర్వహించారు. గ్రంథాలయ సహాయకురాలు కె.అనిత పాల్గొన్నారు.

శర్వాణి పాఠశాలలో..

శ్రీకాకుళం అర్బన్: వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు అని శర్వాణి విద్యాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు అన్నారు. అరసవల్లి రోడ్డులోని శర్వాణి విద్యాలయలో గిడుగు రామ్మూర్తి జయంతిని నిర్వహించారు. రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ రేఖ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సీఎస్‌లో..

పీఎన్ కాలనీలోని న్యూ సెంట్రల్ స్కూల్‌లో గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల యాజమాన్య ప్రతినిధులు పి.శ్రీకాంత్, బలివాడ మల్లేశ్వరరావు, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు పి.జగన్మోహనరావు, శ్రీదేవి తదితరులు గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విశాఖ స్కూల్‌లో..

రామలక్ష్మణ కూడలి వద్ద ఉన్న విశాఖ స్కూల్‌లో గిడుగు రామ్మూర్తి 160వ జయంతి వేడుకలు జరిగాయి. స్కూల్ యజమాని డాక్టర్ మధుసూదన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా క్రీడాదినోత్సవం..

ఎచ్చెర్ల క్యాంపస్: హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా పలు విద్యా సంస్థలో క్రీడా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) క్యాంపస్‌లో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు నివాళులర్పించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడాకారులు పరిణితి కుట్టి, ఎన్.ఈశ్వరరావును సత్కరించారు. వర్సిటీలో క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వైస్‌చాన్సలర్ నిమ్మ వెంకటరావు అన్నారు. రిజిస్ట్రార్ సి.హెచ్.ఎ.రాజేంద్ర ప్రసాద్, స్పోర్ట్స్ డీన్ ప్రొఫెసర్ పీలా సుజాత పాల్గొన్నారు. శివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో స్పోర్ట్స్ డే ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని తహసీల్దార్ టి.సత్యనారాయణ ప్రారంభించారు. కేశవరావుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి క్రీడాకారులను సన్మానం చేశారు. ఏపీజీవీబీ జోనల్ మేనేజర్ బడగల హరినాథ్, సర్పంచ్ పైడి భాస్కరరావు, హెచ్ఎం చల్ల భారతి పాల్గొన్నారు. శ్రీవెంకటేశ్వర కళాశాలలో స్పోర్ట్స్ దినోత్సవం నిర్వహించారు.

అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా తెలుగు భాష దినోత్సం నిర్వహించారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావుకి ఆంధ్రా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ పూర్వపు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.ఎస్.వధాని, సాహితీవేత్త డాక్టర్ అల్లశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కస్తూర్బా విద్యాలయంలో..

జి.సిగడాం: స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా బాలికలు వివిధ రకాల విన్యాసాలు నిర్వహించారు. తెలుగుతల్లి వేషధారణ ఆకట్టుకుంది. 200 వంద మంది కవులు రచించిన పుస్తకాలతో తెలుగు భాష చిత్రాన్ని ఏర్పాటు చేశారు. విద్యాయలం ప్రత్యేకాధికారి ఉషారత్నంకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు బాష ఎంతో గొప్పది..

లావేరు: మండలంలోని లావేరులో గల గ్రంథాలయంలో, లావేరు, బుడుమూరు గ్రామాల్లోని హైస్కూళ్లను మంగళవారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామూర్తి పంతులు చిత్రపటానికి నివాళులర్పించారు. పద్యాలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లావేరు హైస్కూల్‌కు క్రీడా ప్రతిభా అవార్డు..

లావేరు: స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌కు క్రీడా ప్రతిభా అవార్డు (జిల్లాలో 3వ స్థానం) వచ్చిందని హెచ్‌ఎం పి.జగన్నాథరావు అన్నారు. మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. అవార్డు రావడానికి కృషి చేసిన పీడీ కె.రవికుమార్‌ను సన్మానించారు. క్రీడల్లో రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డులు సాధించిన విద్యార్థులకు సత్కరించారు.

న్యాయవాదుల ఆధ్వర్యంలో..

శ్రీకాకుళం పాతబస్టాండ్: గిడుగు జయంతి కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం, జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక స్వాతంత్య్ర సమర యోధుల పార్కులో గిడుగు విగ్రహానికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు, సీనియర్ న్యాయవాది, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాన కష్ణ చంద్ తదితరులు నివాళులర్పించారు.

ఎన్‌టీఆర్ ఎంహెచ్ స్కూల్‌లో..

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని ఎన్‌టీఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రిన్సిపాల్ దేవదత్తానందం సవర భాషకు, వ్యవహారిక భాషకు గిడుగు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం తెలుగు భాషా పండితురాలు ఉమాదేవిని ఘనంగా సన్మానించారు. తెలుగు ఉపాధ్యాయుడు చాడ శ్రీనివాస్, వాడాడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీకూర్మం ఉన్నత పాఠశాలలో..

గార: గార మండలం శ్రీకూర్మం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను ప్రధానోపాధ్యాయిని జి.కృష్ణవేణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయిని శ్రీదేవి, పీడీ మల్లేశ్వరి నేతృత్వంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సోదమ్మ, రాణీరుద్రమదేవి, తెలుగు తల్లి వేషధారణల్లో విద్యార్థినులు అలరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినిలు వాసంతి, గృహలక్ష్మి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్: విద్యార్థినులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న డిగ్రీ కళాశాల ప్రతినిధులు



శ్రీకాకుళం అర్బన్: శ్రీచైతన్య పాఠశాలలో దేశ నాయకుల వేషధారణలో చిన్నారులు



శ్రీకాకుళం అర్బన్: గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్టీసీ ప్రతినిధులు



శ్రీకాకుళం అర్బన్: గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అంధవరపు సూరిబాబు



శ్రీకాకుళం అర్బన్: బలగ గ్రంథాలయంలో గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



జి.సిగడాం: జి.సిగడాం: కేజీబీవీలో పుస్తకాలతో ఏర్పాటు చేసిన తెలుగు భాషాదినోత్సవం అక్షర మాల



శ్రీకాకుళం అర్బన్: విశాఖ స్కూల్‌లో..



శ్రీకాకుళం అర్బన్: గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యూ సెంట్రల్ స్కూల్ ప్రతినిధులు



ఎచ్చెర్ల క్యాంపస్: ట్రిపుల్ ఐటీలో ధ్యాన్ చంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు



శ్రీకాకుళం పాతబస్టాండ్: గిడుగు విగ్రహానికి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు



శ్రీకాకుళం అర్బన్: ఉమాదేవిని సన్మానిస్తున్న దృశ్యం



ఎచ్చెర్ల క్యాంపస్: వీసీ నిమ్మ వెంకటరావుకు సాహిత్య పుస్తకాలు అందజేస్తున్న అల్లశెట్టి చంద్రశేఖర్



గార: వేషధారణలో శ్రీకూర్మం ఉన్నత పాఠశాలలో విద్యార్థినులు



లావేరు: లావేరు హైస్కూల్‌లో రామ్మూర్తి పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

స్వచ్ఛత, మాధుర్యమే తెలుగుభాష: ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి



శ్రీకాకుళం అర్బన్: మాట్లాడుతున్న గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి

శ్రీకాకుళం అర్బన్: పాలలో ఉన్న స్వచ్ఛత, తేనెలో ఉన్న మాధుర్యం కలగలిపిన పదజాలమే తెలుగు భాష అని మహాత్మా జ్యోతీరావుపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మి అన్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు 160వ జయంతి సందర్భంగా శ్రీకాకుళంలోని హయాతీనగరంలో ఉన్న ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ స్కూల్‌లో తెలుగుభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుతల్లి, గిడుగు రామ్మూర్తి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ తెలుగు భాష గొప్పతనాన్ని విద్యార్థినులకు తెలియజేశారు. అలాగే జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా వాసి కావడం గర్వకారణం



శ్రీకాకుళం అర్బన్: గిడుగు విగ్రహానికి నివాళులర్పిస్తున్న పర్యాటక అధికారి నారాయణరావు, కమిటీ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: వ్యహరిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామ్మూరిత పంతులు శ్రీకాకుళం జిల్లా వాసి కావడం మనకు గర్వకారణమని జిల్లా పర్యాటక అధికారి నడిమింటి నారాయణరావు అన్నారు. గాంధీ మందిరం, స్వాతంత్య్ర సమరయోధుల స్మృతివనంలో జిల్లా పర్యాటక శాఖ, ఇంటాక్ శ్రీకాకుళం చాప్టర్ సంయుక్తంగా గిడుగు జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీపీ మొదలవలస చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం కోసం పార్టీ క్యాడర్ సిద్ధం కావాలని ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. దోమాం, కొత్తపేట, ముద్దాడ గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో సమావేశాలు నిర్వహించారు. టీడీపీ నాయకులు ఓటర్ జాబితాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. తప్పుడు ఓట్లు నమోదు చేస్తున్నారని, ఈ అంశంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పారదర్శక ఓటర్ జాబితాలు లక్ష్యంగా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రతి అర్హునికీ ప్రభుత్వ పథకం అందేలా కృషి చేయాలన్నారు. జేసీఎస్ కన్వీనర్ మూగి శ్రీరాములు, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు ముద్దాడ శంకర్, పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు మాడుగుల మురళీధర్‌బాబా పాల్గొన్నారు.

హేతుబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎస్‌డీసీ మురళీకృష్ణ

రణస్థలం: ఓటర్ల జాబితా సమగ్రంగా రూపొందించడం జరిగిందని, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు రాజకీయ పార్టీల ప్రతినిధులు దరఖాస్తు చేసుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎచ్చెర్ల నియోజకవర్గం ఓటర్ల నమోదు అధికారి పి.మురళీ కృష్ణ తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అన్నీ పార్టీల ప్రతినిధులతో మంగళవారం ఓటర్ జాబితాపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ జాబితాలో తొలగింపులు, సవరణలు, చేర్పులు జాబితాను పార్టీల ప్రతినిధులకు ఇవ్వడం జరిగిందని, అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. ఒక కుటుంబం ఒకే బూత్ పరిధిలో ఉండేలా సర్వే సమగ్రంగా చేర్చామని తెలిపారు. జి. సిగడాం మండలంలో 45,041 మంది ఓటర్లు ఉండగా 43,543 మంది ఓటర్ల ఇళ్లకు వెళ్లి పరిశీలించడం జరిగిందన్నారు. లావేరులో 53,140 మంది ఓటర్లకు 52,205 మంది, ఎచ్చెర్ల మండలంలో 71,402 మంది ఓటర్లకు 70,478 మంది, రణస్థలంలో 66,056 మంది ఓటర్లకు 65,977 మంది ఓటర్ల ఇళ్లను పరిశీలించామన్నారు. మత్స్యకార గ్రామాల్లో సాంకేతిక సమస్యల వల్ల పోలింగ్ జాప్యం జరుగుతుందని, పోలింగ్ కేంద్రాలు పెంచాలని మత్స్యకార నాయకులు కోరారు. రణస్థలం, లావేరు, ఎచ్చెర్ల, జి.సిగడాం తహసీల్దార్లు పాల్గొన్నారు.

రక్తదానంపై మహిళల్లో చైతన్యం రావాలి



కొండములగాంలో రక్తదానం చేస్తున్న మహిళలు

రణస్థలం: మహిళలు రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాడం ఎంతో మంది యువతీ, యువకుల్లో చైతన్య నింపుతుందని రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు తెలిపారు. మండలంలోని కొండములగాంలో గ్రామ పెద్దలు, యువత సహకారంతో ఇడదాసుల సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 50 మంది రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్‌కు అందజేశారు. కొండములగాం ఎంపీటీసీ రెడ్డి లక్ష్మి, గ్రామస్తురాలు బరాటం శ్రీదేవి రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఈ శిబిరంలో కొండములగాం గ్రామ పెద్దలు గొర్లె అప్పలనాయుడు, రెడ్డి వాసుదేవరావు, ఇడదాసుల సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు తిరుపతిరాజు, రెడ్ క్రాస్ రాష్ట్రపతి అవార్డు గ్రహిత పెంకి చైతన్య కుమార్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అండగా సీఎం జగన్

- వైఎస్సార్‌సీపీ యువనేత రామ్‌మనోహర్‌నాయుడు
- కిల్లిపాలెంలో ‘గడప గడపకు మన ప్రభుత్వం’



సమావేశంలో మాట్లాడుతున్న రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కరోనా సమయంలో దేశవ్యాప్తంగా ప్రజలు అనేక ఇబ్బందులు పడగా.. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఎలాంటి సమస్యలకు అవకాశం లేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి ఒక్కరినీ ఆదుకున్నారని వైఎస్సార్‌సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. నాలుగేళ్ల ప్రభుత్వ పాలనలో రెండేళ్లు కరోనాతో ఇబ్బందిపడి ఆర్థిక వ్యవస్థ కుదేలైనప్పటికీ సంక్షేమం, అభివృద్ధి పనులు ఎక్కడా ఆపకుండా తీసుకెళ్లిన ఘనత వైఎస్సార్‌సీపీదే అన్నారు. శ్రీకాకుళం నగరంలోని కిల్లిపాలెం–2లో డివిజన్ ఇన్‌చార్జి మామిడి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతిపక్షంతో కాకుండా రాక్షసులు, దత్తపుత్రుడు, ఎల్లో మీడియాతో పోరాటం చేస్తున్నామన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నవారిలో దేశ చరిత్రలో ఇద్దరే ఉన్నారని.. వారిలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు..ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిలేనన్నారు. పేదల కోసం ఆవిర్భవించినదే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్నారు. ధరల పెంపు అనేది దేశమంతా ఉందని.. దాన్ని బూచిగా చూపించి మళ్లీ ఓట్లు దండుకోవడానికి చంద్రబాబు, ఎల్లో మీడియా కుయుక్తులు చేస్తున్నారని.. వాటిని నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ముందు ప్రజలకు పథకాలు అందించడం తమ ప్రభుత్వ విధానం కాదని.. ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమాన్ని అందించడమే జగనన్న లక్ష్యమన్నారు. కిల్లిపాలెం సచివాలయం పరిధిలో విశాఖ–ఏ కాలనీలో ఉండే ప్రజలకు రూ 9.11 కోట్లు సంక్షేమ పథకాల రూపేణా అందించామన్నారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు నిధులు కేటాయించామన్నారు. కాలనీల్లో సమస్యలు లేకుండా చేస్తామన్నారు. మీకోసం .. మీ కాలనీ అభివృద్ధి కోసం మంత్రి ధర్మాన ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ కృషి చేస్తోందన్నారు. ప్రజల మంచికోరేవారి కోసం విజ్ఞతతో ఆలోచించి ఓటేసి గెలిపించాలని కోరారు. మీరంతా విజ్ఞులని చంద్రబాబు పాలనకు.. ప్రస్తుత సీఎం జగన్ పాలనకు భేరీజు వేసుకోవాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఎం.వి.పద్మావతి, సాధు వైకుంఠరావు, ఎం.వి.స్వరూప్, అంబటి శ్రీను, మూకళ్ల తాతబాబు, ఎన్ని ధనుంజయరావు, పొన్నాడ రుషి, డోల తిరుమలరావు, టంకాల బాలకృష్ణ, గుంట తులసీ, ధానేటి శ్రీధర్, చింతాడ మంజుల, మెట్ట రామారావు, సీపాన రామారావు, రుప్ప దివ్య, పైడి మహేశ్వరరావు పాల్గొన్నారు.